# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

MAY - 2019

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# LADS to LEADERS

## బాలకుల నుండి పాలకులయ్యేవరకు

## ఇండియా కన్వెన్షన్

## INDIA CONVENTION

సమయం : 2019 ఆగష్టు 9, 10 తేదీలలో

స్థలము : సత్యవాణి, క్రీస్తు సంఘము, రామారావుపేట, కాకినాడ

క్రీస్తు సంఘములలో యున్న బాలబాలికలను, యువతీ యువకులను, భావితరములకు మంచి నాయకులుగా తీర్చిదిద్దుటకు ఈ కార్యక్రమము ఉద్దేశించబడినది. దేవుని వాక్యములో నైపుణ్యత గల బాలబాలికలకు మంచి బహుమతులు ఇయ్యబడును. ఉచిత భోజన వసతి కల్పించబడును. మీ స్థానిక సంఘములోయున్న బాలబాలికలు, యువకులు హాజరయ్యేటట్లు చూడండి. వివరములకు దిగువ నుదహరించిన వారిని సంప్రదించండి.

**బ్రదర్. లక్ష్మిగూటం**

**సత్యవాణి, కాకినాడ**

**ఫోన్ : 084 2363722**

**98489 98547**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 40 మే - 2019 సంచిక -10


## కృప నుండి తొలగి పోవుట

## (Falling from Grace)

క్రైస్తవులయినవారు పాపములో పడుట అసంభవమని, దేవుని కృపలో నుండి తొలగిపోవుట అసాధ్యమని కొందరు తలంచెదరు. అయితే వారి తలంపులు బైబిలుతో సరితూగుట లేదని ఈ రోజు గమనించబోవుచున్నాము. యేసుక్రీస్తు బోధించిన ఉపమానములే దేవుని బిడ్డ అయినవాడు పాపములో పడుట సాధ్యమేనని, కృపలో నుండి తొలగి పోవుట నిజమేనని బోధించుచున్నవి.

ద్రాక్షావల్లి తీగలను గూర్చిన ఉపమానమును మనము ఇప్పుడు యోహాను 15:1-8 నుండి చదువుకొందము : "నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతితీగెను ఆయన తీసి పారవేయును; ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును. నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నా యందు నిలిచి

యుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి యుంటేనేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నా యందు నిలిచి యుంటేనే గాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచి యుండునో, నేను ఎవని యందు నిలిచి యుండునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగవలె బయట పార వేయబడి యెండి పోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పార వేతురు, అవి కాలిపోవును. నాయందు మీరును మీయందు నామాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అను గ్రహింపబడును. మీరు బహుగా ఫలించుటవలన నాతండ్రి మహిమ పరచబడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు." ఇక్కడ యేసుప్రభువు తన శిష్యులతో చెప్పుచు, నేను ద్రాక్షావల్లిని, శిష్యులైన మీరు నా తీగెలు, ఎవడైనను నా యందు నిలిచి యుండని యెడల, తీగవలె బయట పారవేయబడి యెండిపోవును అని పలికెను. ఇంకొక మాటలో క్రీస్తు శిష్యుడైనవాడు క్రైస్తవుడు. క్రైస్తవుడయి నవాడు క్రీస్తు నుండి, ఆయన కృప నుండి తొలగిపోయి నాశనమగుట జరుగగలదు అని ఈ ఉపమానమును బట్టి మనము గ్రహించు కొనగలము.

యేసుక్రీస్తు చెప్పిన విత్తువాని ఉపమానములో కూడ ఈ భావము మనకు తేటతెల్లముగా కనబడుచున్నది. యేసు ఇట్లనెను : "విత్తువాడు తన విత్తనములు విత్తుటకు బయలుదేరెను. అతడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవపక్కను పడి త్రొక్క బడెను గనుక, అకాశ పక్షులు వాటిని మ్రింగివేసెను. మరికొన్ని రాతినేలను పడి మొలచి చెమ్మలేనందున ఎండి పోయెను. మరికొన్ని ముండ్లపొదల నడుమపడెను; ముండ్లపొదలు వాటితో

మొలచి వాటి నణచివేసెను. మరికొన్ని మంచి నేలను పడెను. అవి మొలచి నూరంతలుగా ఫలించెననెను. ఈ మాటలు పలుకుచు వినుటకు చెవులు గలవాడు వినునుగాక అని బిగ్గరగా చెప్పెను."

ఆయన శిష్యులు ఈ ఉపమాన భావమేమిటని ఆయనను అడిగిరి. దాని భావమును ఆయన వారికిట్లు చెప్పెను : "విత్తనము దేవుని వాక్యము. త్రోవ ప్రక్కనుండువారు, వారు వినువారు గాని నమ్మి రక్షణ పొందకుండునట్లు అపవాది వచ్చి వారి హృదయములో నుండి వాక్యమెత్తికొని పోవును. రాతినేల నుండు వారెవరనగా, వినునప్పుడు వాక్యమును సంతోషముగా అంగీకరించు వారు గాని వారికి వేరు లేనందున కొంచెము కాలము నమ్మి శోధన కాలమున తొలగి పోవుదురు. ముండ్ల పొదలలో పడిన విత్తనమును పోలిన వారెవరనగా, విని కాలము గడచిన కొలది యీ జీవ సంబంధమైన విచారములచేతను, ధన భోగములచేతను అణచివేయబడి పరిపక్వముగా ఫలింపనివారు. మంచి నేల నుండు విత్తనమును పోలిన వారెవరనగా యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారు" (లూకా 8:5 -15). విత్తనమైన దేవుని వాక్యము నాలుగు రకములైన హృదయములలో పడెను. ఒకడు దానినంగీకరించుటకు తిరస్కరించెను. ముగ్గురు ఆ వాక్యమును సంతోషముతో అంగీకరించినను వారి విశ్వాసము బలపడనందున, శోధనలవలన ఆ వాక్యము వారిలో యెండిపోయి నశించెను. అయితే ఈ నలుగురిలోను ఒకే ఒక్కడు మాత్రము నమ్మకముగా యుండి ఫలములను ఫలించెను. అందువలన ఒకడు క్రైస్తవుడైనంత మాత్రముననే సరిపోదు గాని అతడు క్రీస్తుకొరకు ఫలములను ఫలించన యెడల కృపలో నుండి తొలగిపోయి నాశనమయ్యే అపాయమున్నదియని మనము గమనించవలెను.

ఈ యంశముపైననే యేసుక్రీస్తు మరల యిట్లు బోధించెను : "యజమానుడు తన యింటివారికి తగిన వేళ అన్నము పెట్టుటకు వారిపైన ఉంచిన నమ్మకమైనవాడును బుద్ధిమంతుడునైన దాసుడెవడు? యజమానుడు వచ్చినప్పుడు ఏ దాసుడు ఈలాగు చేయుచుండుట అతడు కనుగొనునో ఆ దాసుడు ధన్యుడు. అతడు తన యావదాస్తిమీద వాని నుంచునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. అయితే దుష్టుడైన యొక దాసుడు - నా యజమానుడు ఆలస్యము చేయుచున్నాడని తన మనసులో అనుకొని తన తోడి దాసులను కొట్టమొదలు పెట్టి త్రాగుబోతులతో తినుచు త్రాగుచు నుంటె ఆ దాసుడు కనిపెట్టని దినములోను వాడుకొనిన గడియలోను వాని యజమానుడు వచ్చి, వానిని నరికించి వేషధారులతో కూడ వానికి పాలు నియమించును. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు నుండును" (మత్తయి 24:45-51). ఇతడు ప్రభువు యొక్క సేవకుడే అయినను అతడు అవినీతికి పాల్పడెను. అతనికి చివరిగా వేషధారులతో పాలు నియమించబడెను. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయు ఉండును.

యేసు మరింకొక ఉపమానమును ఈ యంశముపై చెప్పెను : "పరలోకరాజ్యము తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బయలుదేరిన పదిమంది కన్యకలను పోలియున్నది. వీరిలో అయిదుగురు బుద్ధిలేనివారు, అయిదుగురు బుద్ధిగలవారు. బుద్ధిలేనివారు తమ దివిటీలు పట్టుకొని తమతో కూడ సిద్దెలలో నూనె తీసికొనిపోయిరి. పెండ్లి కుమారుడు ఆలస్యము చేయగా వారందరు కునికి నిద్రించుచుండిరి. అర్ధరాత్రి వేళ ఇదిగో పెండ్లికుమారుడు, అతనిని ఎదుర్కొన రండి అను కేక వినబడెను. అప్పుడు ఆ కన్యకలందరు లేచి తమ దివిటీలను చక్కపరచిరి గాని, బుద్ధిలేని కన్యకలు మా దివిటీలు ఆరిపోవుచున్నవి గనుక మీ నూనెలో కొంచెము మాకియ్యుడని

బుద్ధిగల వారినడిగిరి. అందుకు బుద్ధి గల కన్యకలు మాకును మీకును ఇది చాలదేమో, మీరు అమ్మువారి యొద్దకు పోయి కొనుక్కొనుడని చెప్పిరి. వారు కొనబోవుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను. అప్పుడు సిద్ధపడియున్న వారు అతనితో కూడ పెండ్లివిందుకు లోపలికి పోయిరి; అంతట తలుపు వేయబడెను. ఆ తరువాత తక్కిన కన్యకలు వచ్చి - అయ్యా అయ్యా, మాకు తలుపులు తీయుమని అడుగగా అతడు మిమ్ము నెరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా యుండుడి" (మత్తయి 25:1-13). మీరందరు క్రైస్తవులమని చెప్పుకొనుచు ఆయన రాకకొరకు కనిపెట్టుచున్న వారే అయినను వారిలో కొందరు సంసిద్ధులు కానందున పరలోకపు విందునకు వెలుపల యుంచబడిరి.

ఈ ఉపమానములను బట్టి నీవొక సంగతిని గమనించగోర్తాను. అదేమంటే నీవు క్రైస్తవుడనని పేరు పెట్టుకొనినంత మాత్రమున ప్రభువు నిన్ను రక్షించునని తలంచవద్దు. గాని ప్రతి దినము భయముతోను, వణుకుతోను నీ సొంతరక్షణను కొనసాగించుకొనవలెను.

క్రైస్తవుడవయిన తరువాత నీవు నానా విధములైన శోధనలకు గురియై పాపములో జీవించుచున్నావేమో. అట్లయిన నీవు మారుమనస్సు నొంది నీ పాపములు క్షమించబడునట్లు ప్రభువుని వేడుకో. ఆయన రక్తము ఈ ఘడియలోకూడ నిన్ను పవిత్రపరచుటకు శక్తి కలిగియున్నది. ఒకవేళ నీవింకా క్రైస్తవుడవు కాలేదేమో. అట్లయితే యేసుప్రభువు నందు విశ్వాసముంచుము, నీ విశ్వాసమును బహిరంగముగా ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందుము. నమ్మకమైన క్రైస్తవులతో కలసి క్రీస్తుకు నమ్మకమైన సేవ చేయుము. ఆయన నుండి దీవెనలను పొందుము.

## "చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను"

## ( I will dwell in the house of the Lord for ever )

ఇశ్రాయేలీయుల మధుర గాయకుడుగు రాజైన దావీదు, 3000 సం॥ క్రిందట ఇశ్రాయేలును 40 సం॥ పాలించెను. దావీదు అనగా ప్రియమైన వాడు అని అర్ధము. అతడు బెత్లేహేమీయుడైన యెష్షయి యొక్క ఎనిమిదవ కుమారుడు, దేవునికి యిష్టాను సారుడైన మనుష్యుడు. అతడు బహు శూరుడును రూపసియై యుండి తన తండ్రి గొఱ్ఱెలను మేపుచుండెను. దావీదు మహాశూరుడైన గొల్యాతును వడిసెలతోను, రాతితోను కొట్టి చంపి ఇశ్రాయేలీయులకు జయము కలుగజేసెను (1 సమూయేలు 17).

రాజైన దావీదు యొక్క జీవితము మరియు పాలన మనకు పరిశుద్ధగ్రంథములో 1 సమూయేలు, 2 సమూయేలు, 1రాజులు, 2 దినవృత్తాంతములు నందు మనము చూడగలము. అతడు ప్రేమ కలిగిన వ్యక్తి. రాజైన సౌలు నుండి తప్పించుకొని పోయిన కాలమందు అతని తల్లి దండ్రుల యొక్క సంరక్షణ చూచుకొనెను. (1సమూయేలు 22:3). అతడు ప్రేమించే భర్తగా నుండెను. (2 సమూయేలు 12:15–23). అతని కుమారుడైన అబ్షాలోము కొరకు ఎలుగెత్తి ఏడ్చెను (2సమూయేలు 13:31, 14:1, 18:33). ఒక మంచి తండ్రిగా గొప్పవాడైన సొలోమోనుకు సలహాదారుడై యుండెను.

**దావీదు యొక్క ఆసక్తి :**

రాజైన దావీదు యొక్క మంచి లక్షణం ఏమిటంటే అతడు ప్రతి విషయములోను దేవునికి కృతజ్ఞత కలిగి యుండెను. కీర్తనల గ్రంథము దావీదు రచించిన స్తోత్రగీతములు. దేవుని మందిరములో నివసించుటకు అపారమైన ఆశక్తి కలిగియుండెను. దేవుని యొక్క ఆలయం అనగా ప్రత్యక్ష గుడారము లేదా మందిరము. దేవుడు

మోషేకు యిలాగు ఆజ్ఞాపించెను, "నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధ స్థలమును నిర్మింపవలెను" (నిర్గమ 25:8).

**మందిరము ప్రాముఖ్యత :**

దేవుడు ఆ మందిరము నిర్మింపబడుటకు కావలసిన అన్ని వివరములు వారికి యిచ్చెను. ఆ మందిరము వారితో కూడ అరణ్య మార్గముంతటిలో ఉండెను. "ఇశ్రాయేలీయులు కానాను దేశము స్వాధీనపరచుకొనిన తరువాత వారందరు షిలోహునకు కూడి వచ్చి అక్కడ ప్రత్యక్ష గుడారము వేసిరి" (యెహోషువా 18:1). ప్రవక్తయైన సమూయేలు యొక్క కాలము వరకు అక్కడే ఉండెను (క్రీ.శ.50-500 సం॥) ఇశ్రాయేలీయులకును ఫిలిష్తీయులకు జరిగిన యుద్ధకాలమందు దేవుని యొక్క నిబంధన మందసము గుడారమునకు తీసుకొని రాబడినది (1 సమూయేలు 4:3,4). యెహోవా మందసము ఏడు నెలలు ఫిలిష్తీయుల దేశము అష్డోదు నందు ఉండెను. "అంతట కిర్యత్యారీము వారు వచ్చి యెహోవా మందసమును తీసుకొని పోయి కొండయందుండే అబీనాదాబు ఇంట చేర్చెను (1 సమూయేలు 7:12). దావీదు యెహోవా మందసమును తీసికొనివచ్చి గుడారము మధ్యను దాని కొరకు ఏర్పరచిన స్థలమున నుంచగా, దావీధు దహన బలులను సమాధాన బలులను యెహోవా సన్నిధిని అర్పించెను. (2సమూయేలు 6:17).

రాజైన సొలోమోను యెరూషలేములో దేవుని యొక్క గొప్ప ఆలయమును నిర్మించినంత వరకు అది అక్కడే ఉన్నది. దేవుని ఆలయం రాజైన సొలోమోను నిర్మించినప్పటికి దానికి అవసరమైన బంగారం, వెండి మొదలగువాటిని మరియు నమూనాను దావీదు సమ కూర్చెను. మరియు దావీదు యిలా చెప్పెను "మరియు నా దేవుని మందిరము మీద నాకు కలిగియున్న మక్కువ చేత నేను ఆ ప్రతిష్ఠితమైన మందిరము నిమిత్తము సంపాదించి యుంచిన వస్తువులు గాక, నా స్వంత మైన బంగారమును వెండిని

నా దేవుని మందిరము నిమిత్తము నేనిచ్చెదను" (1 దినవృత్తాంతములు 29:3).

కీర్తనకారుడు ఈ విధంగా పాడెను. "యెహోవా యొద్ద ఒక్క వరము అడిగితిని దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను" (కీర్తనలు 27:4). "యెహోవా, నీ నివాసమందిరమును నీ తేజోమహిమ నిలుచు స్థలమును నేను ప్రేమించుచున్నాను" (కీర్తనలు 26:8). "దుప్పి నీటివాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది (కీర్తన 42:1).

**తృష్ణ గల దావీదు :**

రాజైన దావీదు వేకువనే దేవుని ఉనికిని కోరుకున్నాడు, "దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదుకుదును. నీళ్లు లేక యుండియున్న దేశమందు నా ప్రాణము నీ కొరకు తృష్ణ గొనియున్నది" (కీర్తనలు 63:1,2). "సాయంకాలమున, ఉదయమున, మధ్యాహ్నమున నేను ధ్యానించుచు మొఱ్ఱపెట్టుకొందును" (కీర్తన 55:17). "అయినను పగటివేళ యెహోవా తన కృప కలుగ నాజ్ఞాపించును. రాత్రివేళ ఆయనను గూర్చిన కీర్తనయు నా జీవదాతయైన దేవుని గూర్చిన ప్రార్థనయు నాకు తోడుగా ఉండును" (క్రీనలు 42:8). "నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది. నన్ను నిందించిన వారి నిందలు నామీద పడియున్నవి" (కీర్తనలు 69:9).

దావీదు దేవుని ఆలయములో నివసించుటకు గొప్ప ఆసక్తి కలిగి యుండెడివాడు "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" (కీర్తన 122:1). యెహోవా, నీ నివాసములు ఎంత రమ్యములు. యెహోవా మందిరావరణములను చూడవలెనని నా ప్రాణము ఎంతో ఆశపడుచున్నది. అది సొమ్మసిల్లుచున్నది. జీవము గల దేవుని దర్శించు

టకు నా హృదయమును, నా శరీర మును ఆనందముతో కేకలు వేయు చున్నవి. నీ బలిపీఠము నొద్దనే పిచ్చుక లకు నివాసము దొరికెను. పిల్లలు పెట్టుటకు వానకోవెలకు గూటి స్థలము దొరికెను. నీ మందిరము నందు నివసించు వారు ధన్యులు వారు నిత్యము నిన్ను స్తుతించుదురు. నీ వలన బలము నొందు మనుష్యులు ధన్యులు యాత్రచేయు మార్గములు వారికి అతి ప్రియములు. వారు బాకాలోయలోబడి వెళ్లుచు దానిని జలమయముగా చేయుదురు. తొలకిరి వాన దానిని దీవెనలతో కప్పును. వారు నానాటికి బలాభివృద్ధి నొందుచు ప్రయాణము చేయుదురు. వారిలో ప్రతి వాడును సీయోనులో దేవుని సన్నిధిని కనబడును. దేవా, మాకేడెమా దృష్టించుము. నీవు అభిషేకించినవాని ముఖమును లక్షింపుము. నీ ఆవరణములో ఒక దినము గడుపుట వెయ్యి దినముల కంటె శ్రేష్ఠము. భక్తిహీనుల గుడారములో నివసించుట కంటె నా దేవుని మందిర ద్వారము నొంద్ద నుండుట నా కిష్టము" (కీర్తనలు 84:1-10).

**ప్రతిష్టించుకొనిన జీవితము :**

ప్రవక్తయైన సమూయేలు తల్లియైన హన్నా అతడు పుట్టకమునుపే వాని బ్రదుకు దినములన్నిటను యెహోవాకు ప్రతిష్ఠించెను (1సమూయేలు 1:11,28). లూకా సువార్తలో కొంత మంది ప్రవక్తలను, భక్తిగల స్త్రీలను మనము చూడగలము. అన్నా, మిరియాము, దెబోరా, హుల్దా మొదలగువారు.

"మరియు ఆషేరు గోత్రికురాలును పనూయేలు కుమార్తెయునైన అన్న అను ఒక ప్రవక్త్రి యుండెను. ఆమె కన్యాత్వము మొదలు ఏడేండ్లు పెనిమిటితో సంసారము చేసి బహు కాలము గడిచినదై, యెనుబది నాలుగు సంవత్సరములు విధవరాలై యుండి దేవాలయము విడువకు ఉపవాస ప్రార్ధనలతో రేయింబగళ్ళు సేవ చేయు చుండెను" (లూకా 2:36,37).

భక్తిపరురాలైన ప్రవక్త్రియగు అన్నా కూడా దావీదువలె దేవుని

మందిరములో నివసించుటకు అపారమైన ఆశక్తి కలిగియుండెను. దావీదు వలె అన్నా కూడా దేవుని మందరిములో నివసించుటకు ఇష్ట పడెను. 1) ఆమె ఉపవాసముతో దేవునికి సేవ చేసెను. ఆమె ఏరకమైన సేవచేసేదో ఖచ్చితముగా వ్రాయబడ లేదు గాని ఆమె చేసిన పని చాలా ప్రేమ పూర్వకముగా చేసెడిది అని సూచించబడియున్నది. అది చాలా ఘనతగా ఎంచబడినది. సంఘ పరిచారకురాలగు ఫీబే (రోమా 16:1 ,2) యవొదియను, సుంటుకేసు వలె దేవుని మందిరములో సేవ చేయు చుండెను. 2) ఉపవాసము 3) ప్రార్ధనతో రేయింబగళ్ళు సేవచేయు చుండెను. 4) ఆమె ప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచుండెను.

"నీ మందిరమందు నివసించు వారు ధన్యులు: వారు నిత్యము నిన్ను స్తుతించుదురు (కీర్తనలు 84:4). 5) ఆమె విమోచన కొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయునను గూర్చి మాట్లాడుచుండెను. ప్రతి తొలిచూలు మగపిల్ల ప్రభువుకు ప్రతిష్ఠ చేయబడ వలెనని ధర్మశాస్త్రమందు వ్రాయబడి నట్లు తల్లిదండ్రులు శిశువైన యేసును దేవాలయములోనికి తీసికొని వెళ్లిరి (లూకా 2:23). అప్పుడు అన్నా శిశు వైన యేసును చూచి యితడే మన రక్షకుడని ఆయన కొరకు కనిపెట్టు చున్న వారందరితో చెప్పెను.

ప్రవక్తి ఆమె జీవితం అంతా దేవుని సేవకు అంకితం చేసెను. ఆమె బ్రదుకు దినములన్నియు దేవుని మందిరములో నివసించినది. మన మందరము కూడా దేవుని మందిరము లో నివసించుటకు అపారమైన ఆసక్తి గలవారిగా ఉండవలెను.

సజీవుడైన దేవుని సంఘములో మనము బ్రదుకుదినములన్నియు దేవుని సేవచేయుచు, ప్రార్ధనలతోను విమోచకుని ప్రకటించుచు జీవించ వలెను.

మనము ఎల్లప్పుడు దేవుని మందిరములో నివాసము చేయుటకు ప్రయత్నము చేసెదము గాక! (కీర్తనలు 23:6).

– కవితా గూటం

# సగమైన చెప్పబడలేదు

## ( The half has never been told )

షేబదేశపు రాణి రాజైన సొలొమోనును దర్శించుటకు వేల కొలది మైళ్లు ప్రయాణించి వచ్చెను (1 రాజులు 10:1-13). రాజకీయ బంధము కొరకు గాని, యుద్ధ నివారణకు గాని, వ్యాపార సంబంధముల కొరకు గాని గాక కేవలము ఆసక్తిని బట్టి ఆమె అంతదూరము పయనించెను. సొలొమోనుకు కలిగిన కీర్తిని గూర్చియు, జ్ఞానమును గూర్చియు విని స్వయముగా అతని చూచి శోధించుటకు ఆసక్తి కలిగి ఆమె వచ్చెను. ఆమె గొప్ప పరివారముతోను, విస్తారమైన విలువగల బహుమతులతోను బహు గూఢార్థము గల ప్రశ్నలతోను ఆమె అతని దర్శించెను.

ఆమె ప్రశ్నలకతడు జవాబిచ్చుట యే గాక అతడు కట్టించిన మందిరమును, భోజన పదార్థములను, అతని ఉపచారులను వారివస్త్రములను వగయిరాలన్నిటిని చూచి ఆమె విస్మయమొందెను. "నేను వినిన దానిలో సగమైనను నాతో చెప్పబడలేదని" అతని యొద్ద ఒప్పుకొనెను (1రాజులు10:7).

మన చేతిలోయున్న బైబిలు గ్రంధము సత్యవాక్యము. అందున్న సత్యమును మనము వినియున్నను సగమైనను దానిలోనిది మనం విని యుండలేదు అని చివరకు ఒప్పుకొనక తప్పదు.

### దేవుని ప్రేమను గూర్చి సగమైనను చెప్పబడి యుండలేదు :

దేవుని ఆశ్చర్య ప్రేమను గూర్చి అనేక పాఠములు, ప్రసంగములు విని యున్నాము. వ్యాసములు చదివి యున్నాము గాని ఎవరును దానిని పరిపూర్ణముగా మనకు వివరించలేదు. దేవుని ప్రేమ క్రీస్తు ద్వారా మనకు జ్ఞానమునను గ్రహించును (ఎఫెసీ 3:8 -11). దేవుడే నిరీక్షణ, దేవుడే విశ్వాసము అని బైబిలు ఎక్కడా చెప్పక పోయినను, "దేవుడు ప్రేమయై యున్నాడని" మాత్రము అది చెప్పు చున్నది (1యోహాను 4:8). అన్యజనుల ఊహాజనిత దేవుండ్లకు

వేరుగా మన దేవుడున్నారు. ఆ దేవుండ్లు కామ క్రోధ మధ మత్సరములను ప్రతిబింబించువారు.

మన అవుసరములను నెరవేర్చుట ద్వారా దేవుడు మనకు తన ప్రేమ చూపుచున్నారు (మత్తయి 5:45, 1:17). మనకు జీవిత భాగస్వాములను, బిడ్డలను, మిత్రులను అనుగ్రహించి దీవించి యున్నారు. మరియు అవసానకాలమందు ఆయనకు మనకు తన సహాయము ననుగ్రహించుచున్నారు (కీర్తన 46:1).

బైబిలులో అత్యంత ఆదరణీయమైన లేఖనము యోహాను 3:16. అది ఎందువలననో దిగువ గమనించుము.

దేవుడు – గొప్ప వ్యక్తి
లోకమును – గొప్ప ప్రజాసంఖ్య
ఎంతో ప్రేమించెను – అత్యంత భావోద్రేకము
కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు – గొప్ప బహుమానము
విశ్వాసముంచు ప్రతివాడు – అత్యంత అవుసరము
నశింపక – గొప్ప ప్రమాదము
నిత్యజీవము పొందునట్లు అయనననుగ్రహించెను – గొప్ప బహమానము

దేవుని ప్రేమ యొక్క శ్రేష్ఠమైన నిర్ధారణ కల్వరియే (రోమా 5:8). సముద్రము జలములతో నిండి యున్నట్లు పాపము భూమిపై ప్రబలి యుండగా, నీ కొరకును నా కొరకును మరణించునట్లు తండ్రియైన దేవుడు యేసును పంపెను. అట్టి ప్రేమ మానవుని తలంపుల కతీతమైనది.

## క్రీస్తు యొక్క బలియాగము

వాక్చాతుర్యము గల వారనేకులు సిలువను మనకు వివరింపజూచారు. గాని వారిలో ఎవరు దానికి సమీపముగా రాలేకపోయారు. సిలువను మించిన ప్రసంగ వేదిక లేదు. దాని పై వ్రేలాడిన బోధకుని మించిన వాడెవడును లేడు. "తండ్రీ వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" అనువర్తమానమునకు మించినది యేదీలేదు (లూకా 23:34).

ఏదెను వనము నుండి కల్వరి సిలువ వరకు ఎర్రని రక్తపుచారల బలి మనకగుపడును. అయినను యేసు యొక్క అర్పణతో పోల్చదగినవి యేదీ లేదు (యోహాను 1:29). నాతో కలసి

కల్వరి యొద్దకు రండి (లూకా 23:33). ఆ గుంపులో నిలబడి యుండండి, మీ కన్నులు తెరచి చూడండి.

**ఆయన పాదములు చూడుము** : గ్రామ గ్రామములకు తిరిగి దేవుని సువర్తమానము నందించిన ఆ పాదములు ఇప్పుడు వాటిలో దిగ గొట్టబడిన మేకుల వలన వికృతాకార మయ్యాయి.

**ఇంకా పైకి చూడు** : వస్త్ర హీనుడుగా ఆయన సిలువ పై వ్రేలాడ దీయబడ్డాడు. ఆయన అవమానమును అపనిందను మన కొరకు భరించారు (హెబ్రీ 12:2).

**మరల చూడు** : కొరడా దెబ్బల నుండి కారుచున్న రక్తమును వీక్షించుము. ఊపిరి పీల్చుకొను ప్రతిసారి ఆ గాయముల బాధ మరింత ఎక్కువగుచున్నది.

**ఆయన చేతులు చూడుము** : గ్రుడ్డి వారికి చూపును, కుంటి వారికి కాళ్లను, కుష్ఠురోగులకు స్వస్థతను ఇచ్చిన ఆ చేతులు ఇప్పుడు సిలువకు మేకులతో అతక బడ్డాయి.

**ఆయన తల మీదనున్న ముళ్ళ కిరీటము చూడు** : పదునైన ముళ్ళు ఆయన తల నుండి నుదుటి వరకు దిగుచు పై నుండి కారుచున్న రక్తమును చూడు.

**ఆయన కళ్లు చూడు** : ఒకప్పుడు ప్రేమతో ప్రకాశించిన కళ్లు ఇప్పుడు గొప్ప బాధతో కుమిలిపోవుచు బాష్ప బిందువులతో తడిచి యున్నవి.

తనను విడిపించుమని యేసు కోరిన యెడల వేలకొలది దూతలను తండ్రియైన దేవుడు పంపును. గాని మనము నిత్యము జీవించులాగున ఆయన సిలువ పై ఆరుగంటల పాటు ఘోరబాధననుభవించారు (యెషయా 53:5,6).

## రక్షణ విలువ

బాహ్యంగా, క్రీస్తుసంఘ సభ్యత్వము అంతప్రాముఖ్యము కాదని అనుకొంటాము. గాని అంతరంగికముగా అది అత్యంత ప్రాముఖ్యము. అది మనుష్యుని కనుగ్రహించబడిన గొప్పతరుణము (1 యోహాను 3:1). తాను రక్షించిన వారిని దేవుడు

సంఘముతో చేర్చును గనుగ, రక్షింప బడినవారు మాత్రమే అందు సభ్యులగుదురు (అపొ.కా. 2:38, 41, 47). క్రైస్తవులు క్రీస్తు సంఘసభ్యుల గుటకు తమ ప్రాణములను సహా కోల్పోవుటకు సిద్ధపడి యుందురు.

ఈ పాఠమును నేర్పుటకు యేసు రెండు ఉపమానములను బోధించారు. రక్షణ కొరకు మనం దేనినైనా కోల్పోవచ్చును. మొదటిది ఒకడు దాచబడిన ధనము గల పొలమును చూస్తాడు, అతడు తన ఆస్థి నంతటిని అమ్మి ఆ పొలమును స్వాధీనము చేసికొంటాడు (మత్తయి 13:44). రెండవది ముత్యముల వ్యాపారి అత్యంత విలువైన ముత్యము ను కనుగొని తనకున్నదంతయు అమ్మి ఆ గొప్ప విలువైన ముత్యమును స్వాధీనము చేసికొంటాడు (మత్తయి 13:45,46).

వారి వలె మనం ప్రశస్తమైన దానిని కనుగొనినప్పుడు దానిని గుర్తించగలుగాలి. మొదటి వాడు సంపదను వెదుకలేదు గాని దానిని కనుగొన్నాడు, గుర్తించాడు. రెండవ వాడు దానిని వెదికాడు, కనుగొన్నాడు. తనకున్నదంతయు దాని కొరకు ఇచ్చు టకు వెనుకాడలేదు.

అయితే ఈనాడు ఎంతమంది దేవుని ఆరాధనకు క్రమముగా వెళ్లు చున్నారు? ఉచితముగా అనుగ్రహింప బడుచున్న రక్షణను ఎంతమంది స్వీకరించుచున్నారు?

## క్రైస్తవ ఆనందము

చెప్పనశక్యమైన సంతోషమును గూర్చి పేతురు చెప్పాడు (1 పేతురు 1:8). నిత్య సంతోషమును గూర్చి పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 4:4-7). సమృద్ధియైన జీవమును గూర్చి యేసు చెప్పారు (యోహాను 10:10). క్రొత్తగా క్రైస్తవులైన వారు సంతోషముతో నూతన జీవితంలో ప్రవేశిస్తారు (అపొ. కా 8:35-39, 16:30-34). వారు దేవుని కృపను ఎల్లవేళలా పొందుదురు (రోమా 5:2). దేవుడు వారి ప్రార్థన లను వినును (యోహాను 16:21-24) మరియు వారి విన్నపములను నెర వేర్చును (1 యోహాను 5:14,15). దేవుడే వారి పక్షమున పోరాడునన్న

నమ్మకముతో వారు ఉత్సహించుదురు (కీర్తన 5:11,12). మరియు మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగునని వారెరుగుదురు (రోమా 8:28).

దేవుని కృపను గూర్చి అవిశ్వాసికి చెప్పుట ఒక గ్రుడ్డివానికి సూర్యోదయమును వర్ణించుటతో సమానము. షేబదేశపు రాణి వలె వారెన్నడు పూర్తిగ గ్రహించుకోలేకపోవచ్చును. ఇహలోక సంపదను ఆర్జించిన వాడు చనిపోయే వరకు తానెంత బీదవాడో ఎరుగడు.

బహుబీదవాడైన క్రైస్తవుడు ప్రపంచ ధనికులలో ఒకడు ఏలయనగా "శరీర సంబంధమైన సాధకము కొంతమట్టుకే ప్రయోజనకరమగును గాని దైవభక్తి ఇప్పటి జీవము విషయములలోను, రాబోవు జీవ విషయములలోను వాగ్దానముతో కూడిన దైనందున అది అన్ని విషయములలోను ప్రయోజనకరమవును" (1 తిమోతి 4:8).

క్రైస్తవులు తమ పాపములు క్షమింపబడిన రీతిని గూర్చి వెనుకకు తిరిగి జ్ఞాపకముంచు కొందురు (అపొ. కా. 2:38). సంతోష హృదయముతో చుట్టు కలియ జూతురు (తీతు 2:12). మరియు వారబారనిదియు నిష్కళంకమునైన స్వాస్థము కొరకు ఎదురు చూచుదురు (1 పేతురు 1:3–10).

## నరకాగ్ని యొక్క తీవ్రత

నరకము ఒక భయంకర ప్రదేశము, సాతాను కొరకు దేవుడు దానిని సృజించారు. "అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్ని''యని యేసు దానిని వర్ణించారు (మత్తయి 25:41). ఆ యగ్ని ఎన్నడు ఆరిపోదు, అగ్ని గంధకములతో మండు అగ్ని గుండము అది.

అది రెండవ మరణము (ప్రక 20:14). ఈలోకములో జన్మించిన వాడు ఎన్నడు క్రీస్తు రాజ్యమైన సంఘములో ప్రవేశించకుంటే అట్టి వాడు భౌతిక మరణము, ఆత్మీయ మరణము పొందును. అదే నిత్య నరకము. ఈలోకములో జన్మించిన వాడు ఆత్మీయముగా తిరిగి జన్మిస్తే

వానికి రెండవ మరణము సంభవించును.

## పరలోక సౌందర్యము

ఒక క్రైస్తవుడు పరలోకము చేరుకొని దాని సౌందర్యాన్ని తిలకించినప్పుడు ఆశ్చర్యపోవును. నా బోధకుడు పరలోకాన్ని గూర్చి కావలసిన దానికంటే ఎక్కువే చెప్పాడనుకొన్నాను గాని దానిలో సగమైనను అతడు చెప్పలేదనుకొనును.

పరలోక గుమ్మములు ముత్యములు, వీధులు సువర్ణమయము, దూతలు అక్కడ పాడుచుందురు, పరిశుద్ధులు మాత్రమే అక్కడ నివసింతురు; అది దేవుని ఆలయము, సృష్టికర్త దానిని చేసారు. ఈలోక రక్షకుడే దాని యొక్క వెలుగు, జీవాహారమే దాని ఆహారము. జీవజలములు అక్కడ తృష్ణతీర్చును.

అక్కడ దేవుడు ప్రతివాని బాష్ప బిందువును తుడిచి వేయును. మరణము అక్కడ వుండదు, దుఃఖమైనను, ఏడ్పైనను వేదనయైనను ఇక వుండదు (ప్రక 21:4). "రాత్రి యిక నెన్నడు ఉండదు; దీపకాంతియైనను సూర్యకాంతియైనను వానికక్కరలేదు. దేవుడైన ప్రభువే వారిమీద ప్రకాశించును" (ప్రకటన 22:5).

దాని పునాదులు అమూల్యమైన నానావిధరత్నములు, సూర్యకాంతము, నీలము, యమునారాయి, పచ్చ, వైడూర్యము, కెంపు, సువర్ణరత్నము, గోమేధికము, పుష్పరాగము, సువర్ణల సునీయు, పద్మరాగము, సుగంధము అను రత్నములు అవి.

పరలోకానందము ఒక వారము, నెల, లేక సంవత్సరము మాత్రమే కాదు. అది నిత్యము వుండును (మత్తయి 25:46; యోహాను 6:47; 11:25; 14:1-3). మానవ మేధస్సుకు వర్ణ నాతీతమైన ప్రదేశము, పరలోకము, దానిని గూర్చి సగమైనను చెప్పబడలేదు. దానిలో ప్రవేశించుట నీకును సాధ్యమే. షెబదేశపు రాణి వలె దానిని వచ్చి చూడుము.

- అలెన్ వెబ్స్టర్

# మతశాఖలు బైబిలునకు విరోధమే

## ( Denominations are contrary to the Bible)

యేసుక్రీస్తు వారు తనను నమ్మిన బిడ్డలందరు ఏకత్వములో ఉండుటకు ప్రార్థించిరి (యోహాను 17:20-22). క్రొత్త నిబంధన సంఘము ఒకే ఆత్మకు, ఏకహృదయ మునకు చెందినది. విభజింపబడి మనము నిలువలేము (మత్తయి 12: 25).

క్రైస్తవులందరు ఒకే విధముగా మాట్లాడవలెను. (1కొరింధి 1:10, రోమా 15:5,6, 2కొరింధి 13:11, ఫిలిప్పి 2:14-15, 1పేతురు 3:8. ఒకే నియమమును అనుసరింపవలెను. ఫిలిప్పీ 3:16, గలతీ 6:16; ఒకే శరీరముగా ఉండవలెను (ఎఫెస్సీ 4:4). ఆ శరీరమే సంఘము (కొలస్సీ 1:18, ఎఫెస్సీ 1:21-23).

మొదటి శతాబ్దములో క్రైస్తవులందరు, మత శాఖలుగా గాక ఒకే సంఘముగా వుండిరి. మతశాఖ అనగానే విభజన కనిపించుచున్నది గదా? మతశాఖలు వుండవచ్చును అంటే దేవుని బిడ్డలలో విభజనకు ఒప్పుకున్నట్లే గదా? క్రొత్త నిబంధన క్రైస్తవ్యము ఒకే మనస్సు, ఒకే ఆత్మయందు విశ్వాసము, ఒకే బోధ, ఒకే విధమైన ఆరాధన, ఒకే విధమైన క్రైస్తవ జీవితమును కోరుచున్నది. విభజనలు భేదములు ఉండకూడదని హెచ్చరింపబడినది (1 కొరింధి 1:10, 11:18, 12:25, రోమా 16:17). క్రీస్తు విభజింపబడియున్నాడా? (1 కొరింధీ 1:13).

క్రీస్తువారు తన సంఘమును స్థాపించెదనని చెప్పి యెరూషలేములో క్రీ.శ. 33న క్రీస్తు సంఘము స్థాపించబడిన కొన్ని వందల సంవత్సరముల వరకు ప్రస్తుతమున్న

మతశాఖలలో ఏదియు పుట్టి యుండ లేదు. మతశాఖలన్నియు బైబిలును, దాని సిద్ధాంతములను విడిచి, వెళ్లుచున్న రోమనుకథోలిక్కు సంఘమును సరిదిద్దుటకు స్థాపించబడినవని గుర్తించవలెను. మతశాఖలన్నియు, వారి ఆరాధనలలోను, ప్రవర్తనలోను, ఏదో కొన్ని రోమను క్యాథలిక్కుల మతాచారములను కలిగియున్నవి. "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెరికి వేయబడును" (మత్తయి 15:13). గనుక మొదటి శతాబ్ధపు క్రీస్తునంఘమును పునరుద్ధరించవలెను.

బి. ఆనందరావు
క్రీస్తుసంఘము, గుడిపూడి
సెల్ : 6301403850

# దేవుని విభజన రేఖ

## ( God's Dividing Line )

ఇశ్రాయేలీయులు ఒక విగ్రహ మును చేసికొని దాని పూజించినప్పుడు దేవుడు వారిని శిక్షించారు (నిర్గమ 32). అందుకే మోషే "యెహోవా పక్షమున నున్నవారందరు నా యొద్దకు రండి అనగా లేవీయులందరు కూడివచ్చిరి (నిర్గమ 32:26). ఆ రోజు వారికి ఒక విభజన రేఖ ఆయెను.

దేవుడు తరుచు నీళ్లను విభజన రేఖగా వినియోగించారు. జల ప్రళయము పురాతన ప్రజలకు, నూతన తరము వారికి ఒక విభజన రేఖ ఆయెను (ఆది.కా. 6:5–7, 17). లోకము దుష్టత్వముతో నిండియుండి నందున ఆ పాపపులోకమును దేవుడు నీటి ద్వారా నాశనము చేసారు (ఆది.కా. 6:17). గాని నోవహు యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను (ఆది.కా. 6:8). సంభవింపబోవు చున్న ప్రళయమును గూర్చి అతడెట్లు స్పందించాడో

గమనించుము (ఆది.కా. 6:22, 7:5). దేవుని ఆజ్ఞలకులోబడుట ద్వారా నోవహుకు కలిగిన పరిణామము లేమిటి? తీర్పు కొరకు అతడు సిద్ధ పడకుండా యున్నవాడు కాదు (మత్తయి 24:37-39). అతడు దేవుని యందు భయము భక్తి కలిగిన వాడై తనను, తన యింటి వారిని రక్షించు కొనగల్గెను (హెబ్రీ 11:7).

ఎర్ర సముద్రము :

బాని సత్వానికి, స్వాతంత్ర్యమునకు ఎర్రసముద్రము ఒక విభజన రేఖ ఆయెను (నిర్గమ 14:1-31). యోసేపు యొక్క జీవితకాలములో ఇశ్రాయేలీయులు ఐగుప్తులో సౌఖ్యాన్ని సంపదను అనుభవించారు. అయితే యోసేపును ఎరుగని ఫరో ఏలిక ఆయెను (నిర్గమ 1:8). అతడు ఇశ్రాయేలీయులను కఠినముగా బాధించాడు (నిర్గమ 1:9-14). వారికి కలిగిన కఠోరమైన పరిస్థితులను బట్టి ఇశ్రాయేలీయులు మొఱ్ఱపెట్టగా దేవుడు వారి ఆలాపనాలకించెను (నిర్గమ 2:23,24; 3:7). వారిని విమోచించిన తరువాత దేవుడు ఇశ్రాయేలీయులను పరీక్షించెను. ఒక విధంగా వారిని బోనులలో చిక్కుబడిన వారివలె వారికి కగుపడెను. గాని దేవుడు ఎర్రసముద్రమును రెండు పాయలుగా చీల్చెను. ఇశ్రాయేలీయులు ఆరిన నేలననడిచి ఎర్ర సముద్రమును దాటి స్వాతంత్రులైరి.

అయితే ఎర్రసముద్రము దగ్గర యున్న విభజన రేఖ యేది? అది దేవుని యందు గల విశ్వాసముతో కూడిన విధేయతయే (హెబ్రీ 11:29). మరొక సారి విశ్వాసముతో కూడిన విధేయత వలన ఇశ్రాయేలీయులు బానిసత్వము నుండి స్వతంత్రులైరి.

యోర్దాను నది :

నయమాను యొక్క కుష్ఠరోగముకు, దాని శుద్ధికి యోర్దాను నది ఒక విభజన రేఖ ఆయెను (2 రాజులు 5:1-14). నయమాను సిరియా దేశపు

గొప్ప సైన్యాధిపతి. అతడు దేవుని కృప వలన గొప్ప విజయము సాధించాడు. అతడు పరాక్రమము గలవాడు, ధైర్య శాలి. అయినను ఆరోగ్య విషయములో అతనికొక బలహీనత యున్నది. అతడు కుష్టరోగి (2 రాజులు 5:1). అతడు తన కుష్టరోగము నుండి శుద్ధి నొందాలంటే, నయమాను ఇశ్రాయేలు దేశములోని యొర్దాను నదిలో ఏడు మారులు మునగవలెను.

### మనము నేర్చుకొనదగినది

దేవుని ఆజ్ఞలకు విశ్వాసముతో విధేయత చూపించాలని దేవుడు మన నుండి కోరుచున్నారు. పైన చెప్పిన మూడు ఉదాహరణలలోను విధేయత యే ప్రాముఖ్యమాయెను. నేడు కూడ నీరు ఒక విభజన రేఖ వలె యున్నది. బాప్తిస్మము పొందుట ద్వారా సువార్తకు లోబడి రక్షింపబడాలని నేడు దేవుడు కోరుచున్నారు (అపో.కా. 2:38; 22:16).

నీ సంగతియేమి? నీవా విభజన రేఖను దాటవా? అయితే నీవనుభవించుటకు ఆశీర్వాదు లున్నవి (ఎఫెసీ 1:3). దేవునికి విధేయత చూపించుచు జీవించువారికి దేవుడు స్థలము సిద్ధ పరచియున్నారు.

- గస్ నికోలస్


## క్రీస్తు సంఘములు

సమర్పించు ఉచిత బైబిలు కోర్సులో చేరండి.
ఆ పాఠములను మీ యింటి వద్దనే పూరించి ఒక సర్టిఫికేట్‌ను, ఒక బైబిలును ఉచితముగా పొందండి.
ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI - CHURCH OF CHRIST**
**P.O.-BOX : 80, KAKINADA - 533 001. A.P.**

# సంక్షిప్త వార్తలు

2019 ఏప్రియల్ నెల 3,4,5,6 తేదీలలో విజయవాడలోని మధురానగర్‌లో యున్న క్రీస్తుసంఘము దేవుని రాజ్యసువార్త కూడికలు ఘనముగా నిర్వహించిరి. దానికి సహో పి.నెహెమ్యా గారు సారధ్యము వహించి సమర్థవంతముగా నిర్వహించిరి. ఆ కూటములలో సహో ఓర్సు ఆదాము, పి.యస్.ఆర్. జయపాల్, శతనాదమ్, పి.డి.బిషప్, సుజిత్ ప్రేమ్, రోనీ గూటం, డి.డి.రాజు మరియు కె.జి. కుమార్ గార్లు వాక్యపరిచర్య చేసిరి.

మూడవ దినము ఉదయం బైబిలు క్లాసులోను, సువార్తికులు సహవాస కూడికలోను, రాత్రివేళ జరిగిన బహిరంగ సువార్తకూటములోను సోదరులు రోనీగూటం గారు చక్కటి వాక్యపరిచర్య చేయగా హాజరైన సువార్తికులు, తదితరులు ఆశ్చర్యచకితులై దేవుని స్తుతించిరి. జాషువా గూటం గారికి అనేకులు ఫోన్‌చేసి ఆయన రెండవ కుమారుని గూర్చి అభినందించిరి. "రోనీ గూటం గారి బోధ చాల బాగున్నది. ఇప్పటి దినములకవుసరమైన బోధ. చిన్నవాడైనా మంచి బోధకునిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులైన మీకు మా ధన్యవాదములు. కూడికలో కూర్చొనిన ప్రతివారు ఆయనను అభినందించిరి"యని కొందరు సహోదరులు ఉత్తరముల ద్వారా జాషువాగారికి తెలియజేసిరి.

2019 ఏప్రియల్ 11వ తేదీ గురువారం రాత్రి రిక్కీ గూటం దంపతులు తమ ఇరువురు బిడ్డలతో సహ అమెరికా పర్యటన నిమిత్తము బయలు వెళ్లి మరునాటికి అక్కడకు క్షేమముగా చేరుకొనిరి. టెన్నిసీ రాష్ట్రములో నేష్‌విల్ మహానగరంలో జరిగిన **LADS to LEADERS** కన్వెన్షన్‌లో కుటుంబసమేతముగా పాల్గొనిరి. పదివేలకు పైగా హాజరైన బాలబాలికల మధ్య జస్టిన్ గూటం గారు ఆంగ్లభాషలో వంద లేఖనభాగములను కంఠోపాఠముగా వల్లించగా ఆయనకు మొదటి బహుమతి అక్కడ లభించినది. మంచి జ్ఞాపిక కూడ ఆయనకు బహూకరించిరి.

2019 ఆగష్టు 9,10 తేదీలలో భారతదేశంలో సత్యవాణి ప్రాంగణంలో ఇండియా **LADS to LEADERS** సభ జరిగించబడును.

2019 ఏప్రియల్ 26వ తేదీన పిఠాపురం ఏరియాలో యున్న కొందరు మతశాఖ బోధకులకు రోనీ గారు బైబిలు క్లాసు నిర్వహించిరి. ఆయన బోధించిన బైబిలు కోర్సును విని అందరు సంతోషించిరి. మే నెల 18వ తేదీన రోనీ

గూటం గారు కుటుంబసమేతంగా అమెరికాకు ప్రయాణించెదరు.

2019 ఏప్రియల్ 18వ తేదీ గురువారం నాడు శ్రీకాకుళంలో ఆంధ్రా, తెలంగాణ బోధకుల సహవాస సదస్సు ఘనంగా జరిగినది. దానికి శ్రీకాకుళం జిల్లాలో యున్న స్థానిక సంఘములు, బోధకులు సారధ్యము వహించిరి. సహో. యం. సామ్యూల్ రాజు, కె.జి.కుమార్, మేడిద జాన్సన్, విశ్వేశ్వరరావ్, పి. ప్రవీణ్, పి.యస్.ఆర్. జయపాల్ గార్లు వాక్యపరిచర్య చేసిరి. సహో. ఆర్.సి. హెచ్. సద్గుణరావు గారి పర్యవేక్షణ ఫలితముగా ఆ రోజు సాయంకాలానికి సదస్సు సంతోషదాయకముగా ముగిసెను.

ఈ వేసవిలో పలు పట్టణములలోను, పల్లెలలోను సువార్తకూటములు జరుగుచున్నవి. సత్యసువార్త ఈ రీతిగా వెదలజల్లబడుట ఎంతో సంతోషము. దేవుడు మనందరి కృషిని దీవించును గాక!.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-20**

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.